


జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

ఆదివారం 10 మే 2026 | పేజీలు : 8


## హనుమాన్ జయంతి వేళ
# భక్తి సంద్రంగా మంచిర్యాల



హనుమాన్ జయంతి వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో మంచిర్యాల పట్టణం భక్తి పారవశ్యంతో కళకళలాడుతోంది. పట్టణంలోని వివిధ హనుమాన్ ఆలయాల్లో దీక్షలు స్వీకరించిన భక్తులు కొండగట్టు అంజన్న దర్శనం కోసం పాదయాత్రలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ శ్రీ వీర హనుమాన్ మందిర్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఇరుముళ్లు విప్పే కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. 108 రోజులు, 41 రోజులు, 21 రోజులు, 11 రోజుల పాటు హనుమాన్ దీక్షలు చేపట్టిన భక్తులు కాషాయ వస్త్రాలు ధరించి “జై శ్రీరామ్”, “జై హనుమాన్”

**2025 సంవత్సరానికి సంబంధించిన ప్రసవాల సంఖ్య చూస్తే పరిస్థితి ఎంత భయానకం**




# ప్రైవేట్ దవాఖానకు మొగ్గు! ప్రభుత్వ ఆసుపత్రి వద్దు!

*మంచిర్యాల జిల్లాలో ప్రైవేట్ మెటర్నిటీ ఆసుపత్రుల వ్యవస్థ రోజు రోజుకూ భారీ వ్యాపార రంగంగా మారిపోతోందనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. “మాతా--శిశు సేవలు” అనే పవిత్రమైన వైద్య రంగాన్ని కొందరు ప్రైవేట్ ఆసుపత్రులు పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నా యనే ఆరోపణలు ప్రజల మధ్య చర్చనీయాంశమవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులు,ఆధునిక పరికరాలు, ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ గర్భిణీలను ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మళ్లించే వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2025 సంవత్సరానికి సంబంధించిన ప్రసవాల సంఖ్య చూస్తే పరిస్థితి ఎంత భయానకంగా మారిందో స్పష్టమవుతోంది.ప్రభుత్వ మాతాశిశు ఆరోగ్య కేంద్రాల్లో3,424 ప్రసవాలు నమోదవగా ప్రైవేట్ మెటర్నిటీ ఆసుపత్రుల్లో 2,230 ప్రసవాలు జరిగినట్లు సమాచారం.అంటే ప్రభుత్వ ఆసుపత్రులు అందుబాటులో ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.*

# పశువుల అక్రమ రవాణా

**చింతలమానేపల్లి**

పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాపారులు కనీసం చెక్‌పోస్టులను సైతం లెక్క చేయడం లేదు. మహారాష్ట్రలోని గడ్జిరోలి జిల్లా నుంచి నిజామాబాద్ జిల్లాకు అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు లారీలు శనివారం ఉదయం చింతలమానేపల్లి మండలంలోని గూడెం గ్రామం వద్ద అంతరాష్ట్ర వంతెన మీదుగా వచ్చాయి. గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఒక లారీ ఆపకుండా15 కిలో మీటర్లు ముందుకు వెళ్లింది. దీంతో పోలీసులు ముందున్న కర్జెల్లి గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు పశువుల లారీని ఆపగా అందులో 33 ఎడ్లు పట్టుబడ్డాయి. గూడెం చెక్‌పోస్ట్ వద్ద మరోలారీని ఆపి తనిఖీ చేయగా అందులో 39 పశువులు గుర్తించగా అందులో 32 ఆవు లు, 7 చిన్న దూడలు పట్టుబడ్డాయి. ఈ 72 పశువుల్లో దేనికి అనుమతి పత్రాలు లేకపోవడంతో అక్రమ రవాణాగా పరిగణించి 11 మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జీవన్ తెలిపారు. వీరిలో 6 అదుపులో ఉండగా 5 నిందితులు పరారీలో ఉన్నారని ఎస్‌ఐ తెలిపారు. రెండు లారీల సీజ్ చేయడంతో పాటు పశువులను పోలీస్‌స్టేషన్ ఆవరణకు తరలించారు. బక్రీద్ సందర్భంగా అక్రమంగా పశువుల రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రూల్స్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సంతోష్ హెచ్చరించారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు.



# ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికులను అండర్‌గ్రౌండ్‌లో పనిచేయాలని ఒత్తిడి తెస్తున్నారు

## ఏఐటీయూసీ నాయకులు

### ఆర్కే-7 గనిలో కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆందోళన



**మంచిర్యాల, 9, మే (ప్రజాజ్యోతి):**సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు శనివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిని సందర్శించి కార్మికులతో సమావేశమై వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య గనిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులు తమకు ఎదురవుతున్న అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికులకు కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రి సీఎంఓలు రెండు నుంచి మూడు నెలల పాటు సర్ఫేస్ డ్యూటీలో ఉంచాలని స్పష్టమైన సిఫార్సులు చేస్తున్నప్పటికీ, కొంతమంది అధికారులు ఆ సూచనలను అమలు చేయ కుండా మళ్లీ అండర్‌గ్రౌండ్‌లో పనిచేయాలని ఒత్తిడి తెస్తున్నారని నాయకులు ఆరోపించారు. సీఎంఓ సూచనలను పట్టించు కోకుండా బలవంతంగా విధులు నిర్వహింపజేస్తే కార్మికుల ఆరోగ్యానికి లేదా ప్రాణాలకు ముప్పు ఏర్పడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే గనిలో కార్మికులకు అవసరమైన పనిముట్లు సకాలంలో అందడం లేదని, ముఖ్యంగా రూఫ్ బోల్టర్లకు అవసరమైన 27 ఎంఎం బిట్లు గత ఆరు నెలలుగా ఇవ్వక పోవడం వల్ల పనుల్లో ఇబ్బందులు ఎదురవు తున్నాయని తెలిపారు. ఇన్సెంటివ్ టబ్ ఆవరేజ్ సక్రమంగా అమలు చేయడం లేదని, సపోర్ట్ మెన్ రూమ్ నిర్మాణానికి అనుమతులు వచ్చినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడు తున్న పలువురు కార్మికులకు ఇప్పటివరకు మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించి అర్హులైన వారికి ఫిట్ ఫర్ సర్ఫేస్ కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణ, సురక్షిత పని పరిస్థితులు కల్పించడం యాజమాన్యం ప్రాథమిక బాధ్యత అని గుర్తు చేశారు. ఈ సమస్యలపై గని మేనేజర్‌ను కలిసి వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సెక్రటరీ మారపల్లి సారయ్య, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ సదానందం, నాయకులు బానేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రమశక్తి అవార్డు గ్రహీత జెట్టి శంకర్రావుకు ఘన సన్మానం



శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో ఉద్యోగులు, అధికారుల అభినందనలు



**మంచిర్యాల, 9,మే (ప్రజా జ్యోతి):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "శ్రమశక్తి అవార్డు" అందుకున్న ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావుకు శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో శనివారం ఘన సన్మానంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగినులు పూల బొకేలు అందించి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా ఐఎన్‌టీయూసీ యూనియన్‌లో అంకితభావం తో పనిచేస్తూ కార్మిక ఉద్యమంలో విశిష్ట గుర్తింపు పొందిన జెట్టి శంకర్రావు కార్మికుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నారని వక్తలు కొనియాడారు. సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నా న్నారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు భూగర్భశాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా జెట్టి శంకర్రావు "శ్రమశక్తి అవార్డు" అందుకోవడం పట్ల ఉద్యోగ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సమాజ సేవలోనూ ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారని, ఇలాంటి అవార్డు రావడం సింగరేణి కార్మిక వర్గానికే గౌరవమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జెట్టి శంకర్రావు మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గౌరవం సింగరేణి ఉద్యోగులు, కార్మికులు, మహిళా కార్మికులు, సూపర్వైజర్లు, ట్రేడ్స్‌మెన్, అధికారుల సహకార ఫలితమని అన్నారు. గత 40 సంవత్సరాలుగా తనపై విశ్వాసం ఉంచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అవార్డు సాధనకు సహకరించిన ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, సెక్షన్ అధికారులు, సూపర్వైజర్లు, కేంద్ర కార్యదర్శి కె. బ్రహ్మాచారి, బ్రాంచ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శి రమేష్‌తో పాటు వివిధ విభాగాల ఉద్యోగులు, ఉద్యోగినులు పాల్గొన్నారు.

## ఫాస్టాగ్ చెక్ పోస్టులను ను ఎత్తివేయాలని బిజెపి రాస్తా రాకో



**జన్నారం,మే9(ప్రజాజ్యోతి)** అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ చెక్ పోస్ట్ లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో తపాలాపూర్ చెక్ పోస్ట్ వద్ద శనివారం రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షులు జీ.మధుసూదన్ రావు మాట్లాడుతూ ఫాస్టాగ్ పేరుతో అటవీశాఖ అధికారులు వాహనదారుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. జన్నారం మండలంలోని ఇందనం పెళ్లి, తపాలపూర్ వద్ద ఏర్పాటుచేసిన ఫాస్టాగ్ చెక్పోస్టను వెంటనే ఎత్తువేయాలని లేనియెడల ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల రమేష్ గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా బద్రీనాయక్, పోనకల్ ఉపసర్పంచ్ అప్పాల జలపతి, పార్టీ సీనియర్ నాయకులు కొంతం శంకరయ్య,సామల లక్ష్మీరాజం,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## వడదెబ్బ పై రైతులకు అవగాహన కార్యక్రమం



**మంచిర్యాలరూరల్ మే09(ప్రజాజ్యోతి)** హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పడ్తన్పల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ దొంద ఏసయ్యతో కలిసి వడదెబ్బ నివారణ,ఓఆర్ఎస్ వినియోగంపై మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పడ్తన్పల్లి, కర్ణమామిడి గ్రామాల ఐకెపి వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు,కార్మికులకు వేసవి జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతూ,అధిక ఉష్ణోగ్రతల సమయంలో బయట పనులు తగ్గించాలని సూచించారు. రోజులో అధికంగా నీరు, కొబ్బరి నీళ్లు,ఇతర ద్రవపదార్థాలు తీసుకోవాలని, తేలికపాటి కాటన్ దుస్తులు ధరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణీలు,చిన్నపిల్లలు, బాలింతలు, వృద్ధులు,డయాబెటిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే బాధితుడిని వెంటనే నీడ ప్రాంతానికి తరలించి,చల్లని నీటితో శరీరాన్ని శుద్ధి చేయాలనీ , ఓఆర్ఎస్ లేదా గ్లూకోజ్ ద్రావణం తాగించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు,హాజీపూర్ పీహెచ్‌సీ సిబ్బంది రఘుపతి,శ్రీనివాస్,సీసీ రాజమణి,ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రైతు వారోత్సవాల్లో భాగంగా లోయర్ డ్యామ్ ను సందర్శించి పరిశీలించినసిర్పూర్ (టి) ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ రావు



**మే 9 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నియోజకవర్గంలోని కాగజ్నగర్ మండలంలోని ఈజ్గాం విలేజ్ నంబర్ -4లో రైతు వారోత్సవాల్లో భాగంగా లోయర్ డ్యామ్‌ను సందర్శించి, పరిశీలించిన సిర్పూర్ (టి) ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ రావు ఈ డ్యామ్ యొక్క షటర్లు మరియు సైఫాన్ మరమ్మతుల కోసం తక్షణం రూ.50లక్షలు మంజూరు చేస్తున్నామని అన్నారు. వెంటనే పనులు ప్రారంభించి వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు రైతులకు ఊరట కల్పించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిన నేపథ్యంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం లేదని, ప్రతి అభివృద్ధి ఫైలు ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో ఆగే పరిస్థితి వచ్చిందని తెలిపారు. అదేవిధంగా కొమురం భీం అడ ప్రాజెక్టు కాలువ భూసేకరణ కోసం తను ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి రూ. 5 కోట్లు రైతులకు విడుదల చేయించానని, తద్వారా కాలువ పనులు నడుస్తున్నాయని, వచ్చే వానాకాలం నాటికి కాలువ ద్వారా కాగజ్ నగర్ మండలానికి సాగునీరు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఇరిగేషన్ శాఖ ఈఈ ప్రభాకర్, డీఈ తిరుపతి, భద్రయ్య, ఏఈలు క్రాంతి, స్వామి, నజ్రుల్ నగర్ సర్పంచ్ బికాస్ ఘరమీ, నాయకులు అమిత్ బిశ్వాస్, లోనారే రవీందర్, అభినాథ్ వైద్య, కాను కమల్ సర్కార్, జ్యోతిర్మయి మండల్, రణ్వీర్ బిశ్వాస్, నవీన్ గౌడ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేళ భక్తి సంద్రంగా మంచిర్యాల

### కొండగట్టు అంజన్న సన్నిధికి హనుమాన్ దీక్ష స్వాముల పాదయాత్రలు ప్రారంభం

### కాషాయ వస్త్రాలతో భక్తుల సందడి.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

### భక్తి గీతాలతో మార్మోగిన రాంనగర్ శ్రీ వీర హనుమాన్ ఆలయం





**మంచిర్యాల, 9, మే (ప్రజా జ్యోతి):**హనుమాన్ జయంతి వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో మంచిర్యాల పట్టణం భక్తి పారవశ్యంతో కళకళలాడుతోంది. పట్టణంలోని వివిధ హనుమాన్ ఆలయాల్లో దీక్షలు స్వీకరించిన భక్తులు కొండగట్టు అంజన్న దర్శనం కోసం పాదయాత్రలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ శ్రీ వీర హనుమాన్ మందిర్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఇరుముళ్లు విప్పే కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.108 రోజులు, 41 రోజులు, 21 రోజులు, 11 రోజుల పాటు హనుమాన్ దీక్షలు చేపట్టిన భక్తులు కాషాయ వస్త్రాలు ధరించి “జై శ్రీరామ్”, “జై హనుమాన్” నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. ఆలయ ప్రధాన పూజారి వామనభట్ల వెంకట రమణ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములు భజనలు, కీర్తనలు చేస్తూ పాదయాత్రకు సిద్ధమయ్యారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి వామనభట్ల వెంకట రమణ శర్మ మాట్లాడుతూ, హనుమాన్ జయంతి ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైన పర్వదినమని తెలిపారు. భక్తి, బలం, ధైర్యం, నిష్ఠకు ప్రతీక అయిన ఆంజనేయ స్వామిని స్మరించుకుంటూ దీక్షలు చేపట్టడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్నారు. హనుమంతుడు శ్రీరాముడిపై అపారమైన భక్తి చూపిన మహాభక్తుడని, కష్టకాలంలో భక్తులను ఆదుకునే వరప్రదాతగా కోట్లాది మంది విశ్వసిస్తున్నారని అన్నారు.శనివారం సాయంత్రం పట్టణంలోని హనుమాన్ ఆలయాల్లో మహా హారతులు నిర్వహించిన అనంతరం భక్తులు కొండగట్టు అంజన్న సన్నిధికి పాదయాత్రగా బయలుదేరారు. ఈనెల 12న జరగనున్న “ హనుమాన్ జయంతి “ సందర్భంగా కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్ష విరమణ చేయనున్నట్లు స్వాములు ఈ సందర్భంగా తెలిపారు.“కొండగట్టు అంజన్న వరాల దేవుడు. మనస్ఫూర్తిగా కోరుకున్న కోరికలను తీర్చే దైవం. మా కుటుంబాలకు ఆంజనేయ స్వామి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలనే సంకల్పంతోనే దీక్షలు తీసుకున్నాం” అని పలువురు స్వాములు తెలిపారు. మంచిర్యాల పట్టణంతో పాటు జిల్లాలోని జైపూర్, చెన్నూర్, లక్షెట్టిపేట, నస్పూర్, బెల్లంపల్లి తదితర ప్రాంతాల హనుమాన్ ఆలయాల్లో దీక్షలు చేపట్టిన వందలాది మంది భక్తులు కూడా కొండగట్టు వైపు పాదయాత్రలు కొనసాగిస్తున్నారు. మార్గమధ్యంలో వివిధ గ్రామాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, నీటి సదుపాయాలు ఏర్పాటు చేయడానికి స్థానిక యువకులు, సేవా సంఘాలు ముందుకు వస్తుండటం విశేషం.రాంనగర్‌లోని శ్రీ వీర హనుమాన్ మందిర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి వామనభట్ల వెంకట రమణ శర్మతో పాటు గురుస్వామి యాదగిరి, రమేష్, అనిల్, సాగర్, రవీందర్, రాజు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ప్రతి ఏడాది హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు అంజన్న ఆలయానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. తెలంగాణలో అత్యంత ప్రసిద్ధ ఆంజనేయ క్షేత్రాల్లో ఒకటైన కొండగట్టు ఈసారి కూడా భక్తజన సందోహంతో కళకళలాడనుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం ఆహ్వానంతో పాల్గొని సకినాల సతీష్ దంపతులకు శుభా కాంక్షలు తెలిపిన సిర్పూర్(టి)శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు



**మే 9 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియోజకవర్గంలోని కాగజ్ నగర్ మండలం కొత్త సార్సాల గ్రామంలో సకినాల సతీష్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం ఆహ్వానం అందు కున్న సిర్పూర్ (టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ రావు వారి స్వ గ్రామంలోని ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొని ఇంటి యజమానులైన సకినాల సతీష్ దంపతు లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు హరి బాబు మాట్లాడుతూ లబ్ధిదారులందరూ వానాకాలం ప్రారంభమయ్యేలోపు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో భాజపా మండల అధ్యక్షులు పుల్ల అశోక్, రాజు, శ్రీకాంత్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజా సేవలో ఉండాలి, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ ను శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించి న మాజీ మంత్రి జోగు రామన్న



**మే 9, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ ఆదిలాబాద్ చేరుకొని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న కు వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంలో ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ ను అందించారు.శుభా కాంక్షలు తెలిపి శాలువా తో ఘనంగా సన్మానించి సత్కరించారు.నిరంతరం ప్రజా సేవలో ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ. ప్రజలు ఉంచిన నమ్మ కాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.నిరంతరం ప్రజా సేవలో ముందుండా లని అన్నారు.అదే విధంగా ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం లో అదిలాబాద్ వైస్ చైర్మన్ రోహిత్, ఆసిఫాబా ద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్‌ను శాలువా లతో ఘనంగా సన్మానించి సత్కరించిన అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ సాజిద్ ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ యునుస్ అక్బని ఎండీ అహ్మద్‌కు శాలువా కప్పి ఘనంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ నిసార్, ఫిరోజ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## డెంటల్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సిర్పూర్(టి) ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ రావు



**మే 9 సిర్పూర్ (టి) నియోజక వర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియోజకవర్గంలోని కాగజ్నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలో డా.చొల్లంగి చైతన్య సాయి (బిడిఎస్,ఎండిఎస్) నిర్వహణలో ఏర్పాటు చేసిన భవానీ మల్టీ స్పెషాలిటీ డెంటల్ మరియు ఇంప్లాంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సిర్పూర్ (టి) శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యా నికి శుభాకాంక్షలు తెలిపి డెంటల్ హాస్పిటల్ కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించా లని కోరారు.

## ఫాస్టాగ్ చెక్పోస్ట్ ల వల్ల వాహనాల సమయం ఆదా అవుతుంది.

నమోదు చేసుకున్న స్థానిక వాహనాలకు వర్తించదు



**జన్నారం,మే9(ప్రజాజ్యోతి)**అటవీశాఖ ఆధ్వర్యంలో ఇంధనపెల్లి వద్ద ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ చెక్పోస్ట్ ను ఎమ్మెల్యే బొజ్జు పటేల్,తపాలపూర్ వద్ద ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ చెక్పోస్ట్ ను డి.ఎఫ్.ఓ రాహుల్ కిషన్ జాదవ్లు శుక్రవారం రోజున ప్రారంభించిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా ఎఫ్.ఆర్.ఓ లు సుష్మారావు,లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ గతంలో ఎన్విరాన్మెంట్ సెస్ ను నగదు రూపంలో తీసుకొని రశీదు ఇచ్చే విధానం ఉండేదని, దీనివల్ల వాహనాలు కొంత సమయము ఆగవలసి వచ్చేదని అన్నారు ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ విధానం వల్ల వాహనదారుల సమయం ఆదా అవుతుందని మరియు చెక్పోస్ట్ వద్ద వాహనాల నిలుపుదల తగ్గుతుందని అన్నారు.స్థానికంగా దండేపెల్లి, జన్నారం, ఉట్నూర్, కడం, దస్తురాబాద్ మండలాలకు చెందిన కార్లకు మినహాయింపు ఉంటుందని అన్నారు. ఆయా మండలాలకు చెందిన వాహనాల నెంబర్లు నమోదు చేయబడుతున్నాయని ఇంకా ఎవరైనా వాహనాలు నమోదు కాకపోతే వారు తమ వాహనాలకు సంబంధించిన ఆర్.సి మరియు ఆధార్ ప్రతులను చెక్పోస్ట్ వద్ద గాని రేంజ్ కార్యాలయంలో కానీ ఇచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్విరాన్మెంట్ సెస్ కొత్తగా విధించినది కాదని ఇది ఇంతకు ముందు నుండే అమలులో ఉందని ప్రజలు గమనించాలని దీనిపై ఎవరు అపోహ పడాల్సిన అవసరం లేదని అన్నారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు ఉంటాయి కాబట్టి వాహనదారులు స్పీడ్ లిమిట్ పాటిస్తూ నెమ్మదిగా ప్రయాణించాలని వారు కోరారు.

## ఇంటి పనివారి, అద్దెదారుల వివరాలు పోలీసులకు ఇవ్వాలి

నేపాల్ వర్కర్లపై ప్రత్యేక నిఘా: ఎస్పీ నితికా పంత్

ఆధార్, ఫోటో, ఫోన్ నంబర్ తప్పనిసరి



**ఆసిఫాబాద్, మే 9 ప్రజా జ్యోతి** ఇళ్లలో పనిచేసే వంట మనుషులు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు సహాయకుల పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పనివారి ఆధార్ కార్డు, నివాస చిరునామా, ఫోటో, మొబైల్ నంబర్ ఇవ్వాలని, నేపాల్కు చెందిన వారిని పూర్తి ధృవీకరణ తర్వాతే పనిలోకి తీసుకోవాలని సూచించారు. అద్దెకు గదులు ఇచ్చేవారు అద్దెదారుల వివరాలు పోలీసులకు తెలిపి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అనుమానాస్పద ఘటనలు నివారించి ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యమని ఎస్పీ తెలిపారు.

## ఏసీ డీపీఓ ఉమా ఫాతిమా ఆధ్వర్యంలో వివాహం నిలిపివేత

బాధ్యులపై కేసు నమోదు చేస్తామని వెల్లడి

బాల్య వివాహం చేస్తే కఠిన చర్యలు: డీసీపీఓ మహేష్



**ఆసిఫాబాద్ మే 9.ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండల కేంద్రంలోని గోయగావ్ గ్రామంలో శనివారం జరగాల్సిన బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. 1098 చైల్డ్ హెల్ప్ లైన్కు అందిన సమాచారంతో బాల రక్ష భవన్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. సమాచారం అందిన వెంటనే బాల రక్ష భవన్ సిబ్బంది, స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఏసీ డీపీఓ ఉమా ఫాతిమా ఆధ్వర్యంలో డీసీపీఓ ఆదేశాల మేరకు వివాహ ఏర్పాట్లను పరిశీలించి బాల్య వివాహాన్ని నిలిపివేశారు. మైనర్ బాలికను అక్కడి నుంచి రక్షించి ఆసిఫాబాద్లోని సఖి కేంద్రానికి తరలించారు. సఖి కేంద్రంలో బాలికకు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీఓ మహేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ దుర్గం పితంబర్, కేస్ వర్కర్ వెంకటేశ్వర్లు, సుకన్య, స్థానిక పోలీస్, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. బాల్య వివాహాల సమాచారం ఉంటే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్కు తెలియజేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రామనామ స్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం



**జన్నారం,మే9(ప్రజాజ్యోతి)** జన్నారం గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రోజున రామ యజ్ఞాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రామ యజ్ఞాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మారు మ్రోగింది.హనుమాన్ దీక్షా పరుల భజనలు,వేద మంత్రాల మధ్య రామ యజ్ఞం అంగరంగ వైభవంగా జరిగింది. రామయజ్ఞం అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

రోడ్డెక్కిన రామారావుపేట రైతులు



**జైపూర్ మే 9 ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని రామారావు పేట గ్రామ రైతులు వరి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇందారం జాతీయ రహదారిపై నిరసనకు దిగారు.పంట కోసి కొన్ని రోజులైనా కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలుగా పేరుకుపోతుండటంతో వర్షాలు వస్తే తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని రైతులు తెలిపారు.పంట సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు ధాన్యం అమ్ముడుకాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు.అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.రైతుల నిరసనతో ఇందారం జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్లో చిక్కుకున్న ఓ వాహనంలో అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ఉన్నట్లు గుర్తించిన రైతులు వెంటనే స్పందించి దారి క్లియర్ చేసి ఆసుపత్రికి వెళ్లేలా సహకరించారు.సమస్యల మధ్య కూడా రైతులు మానవత్వం చాటడం స్థానికంగా చర్చనీయాంశమైంది.కొంతసేపు ఉద్రిక్తంగా సాగిన ఆందోళన అనంతరం అధికారులు వచ్చి రైతులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రైవేట్ దవాఖానకు మొగ్గు! ప్రభుత్వ ఆసుపత్రి వద్దు!

**మంచిర్యాలరూరల్ మే09(ప్రజాజ్యోతి)**మంచిర్యాల జిల్లాలో ప్రైవేట్ మెటర్నిటీ ఆసుపత్రుల వ్యవస్థ రోజు రోజుకూ భారీ వ్యాపార రంగంగా మారిపోతోందనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. “మాతా--శిశు సేవలు” అనే పవిత్రమైన వైద్య రంగాన్ని కొందరు ప్రైవేట్ ఆసుపత్రులు పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నాయనే ఆరోపణలు ప్రజల మధ్య చర్చనీయాంశమవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులు,ఆధునిక పరికరాలు, ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ గర్భిణీలను ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మళ్లించే వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2025 సంవత్సరానికి సంబంధించిన ప్రసవాల సంఖ్య చూస్తే పరిస్థితి ఎంత భయానకంగా మారిందో స్పష్టమవుతోంది.ప్రభుత్వ మాతాశిశు ఆరోగ్య కేంద్రాల్లో3,424 ప్రసవాలు నమోదవగా ప్రైవేట్ మెటర్నిటీ ఆసుపత్రుల్లో 2,230 ప్రసవాలు జరిగినట్లు సమాచారం.అంటే ప్రభుత్వ ఆసుపత్రులు అందుబాటులో ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.కాని ఈపరిస్థితి ప్రజల స్వచ్ఛంద ఎంపికా?లేక భయాందోళనలు సృష్టించి ప్రైవేట్ ఆసుపత్రుల వైపు నెట్టివేస్తున్న వ్యవస్థ ఫలితమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.( పభుత్వ మాతాశిశు ఆరోగ్య కేంద్రాల్లో ప్రసూతి వైద్య నిపుణులతో పాటు పిల్లల వైద్యులు, అనస్థీషియా నిపుణులు,అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయి. అనేక సందర్భాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణీలకు కూడా విజయవంతంగా చికిత్స అందిస్తున్నారని వైద్య వర్గాలు చెబుతున్నాయి.అయినప్పటికీ ప్రైవేట్ ఆసుపత్రులే “భద్రం”,‘ ‘అత్యుత్తమం” అనే ప్రచారం బలంగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అమాయక ప్రజలు ఈ ప్రచారానికి లోనై అప్పులు చేసి మరి ప్రైవేట్ ఆసుపత్రుల గడప తొక్కుతున్న పరిస్థితి కనిపిస్తోంది.సాధారణ ప్రసవానికి రూ.20 వేల వరకు, సిజేరియన్‌కు రూ.30 వేల నుండి రూ.40 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.కొన్నిచోట్ల పరీక్షలు,మందులు, ఐసీయూ, పిల్లల చికిత్స పేర్లతో లక్ష రూపాయల వరకు బిల్లులు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రసవం అనే సహజ ప్రక్రియను “హై రిస్క్ కేసు”గా చూపించి కుటుంబ సభ్యులను భయపెట్టి అవసరం లేకున్నా సిజేరియన్‌లు చేస్తున్నారనే విమర్శలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.ముఖ్యంగా బర్త్ రూట్స్ హాస్పిటల్,శ్రీలత నర్సింగ్ హోమ్,నందిని నర్సింగ్ హోమ్ వంటి ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య అధికంగా నమోదవుతున్నట్లు తెలిసింది.అదే స్థాయిలో ఫిర్యాదులు,అసంతృప్తి, నిర్లక్ష్య వైద్యంపై ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం పెద్దగా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.రెండు సంవత్సరాల క్రితం బెల్లంపల్లి చెందిన ఒక




మహిళ ప్రసవం అనంతరం తీవ్ర రక్తస్రావంతో మరో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ప్రజలను కలచివేసింది.గత ఏడాదిలో సైతం ఆసిఫాబాద్ ప్రాంతానికి చెందిన గర్భిణీ ప్రసవం సమయంలో పేరు మోసిన ఆసుపత్రిలో మృతి చెందింది.ఒక ప్రాణం పోయిన అనంతరం సంబంధిత అధికారుల స్పందన “మాకు ఫిర్యాదు రాలేదు” అనే స్థాయిలో ఉండటం మరింత బాధాకరం.ఒక కుటుంబం తమ ఇంటి ఆడపడుచును కోల్పోయి శోకసంద్రంలో మునిగిపోయిన సమయంలో కార్యాలయాల చుట్టూ తిరిగి ఫిర్యాదులు చేయడం సాధ్యమా?అనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు.ప్రైవేట్ ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వడం,లైసెన్సులు జారీ చేయడం, రెన్యువల్స్ చేయడం వంటి అంశాల్లో చురుకుగా వ్యవహరించే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,అధిక వసూళ్లు,నిర్లక్ష్య వైద్యం, రోగుల మరణాల విషయంలో మాత్రం నిశ్శబ్దంగా ఉండటం ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది.తనిఖీలు కూడా కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకున్న ఉదాహరణలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. సిర్పూర్,చెన్నూర్, బెల్లంపల్లి,మహారాష్ట్ర నుండి చంద్రాపూర్,సిర్వాంచ పరిసర ప్రాంతాల ప్రజలు సైతం మంచిర్యాలకు వైద్య సేవల కోసం వస్తున్నారు.ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొన్ని ఆసుపత్రులు భారీ స్థాయిలో డబ్బు దండుకుంటున్నారనే ఆరోపణలు బలపడుతున్నాయి.రోగి పరిస్థితి గురించి పూర్తి వివరాలు చెప్పకుండా భయపెట్టి డబ్బులు వసూలు చేయడం,అత్యవసర పరిస్థితి పేరుతో బిల్లులు పెంచడం,ఫార్మసీల ద్వారా అదనపు భారాలు మోపడం వంటి అంశాలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తున్నాయి.ప్రైవేట్ ఆసుపత్రుల్లో పరిశుభ్రత, అర్హత కలిగిన సిబ్బంది, అత్యవసర సేవలు,రక్త నిల్వలు,ఐసీయూ సదుపాయాలు, శిశు సంరక్షణ ప్రమాణాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు జరగాల్సి ఉంది.కానీ అధికారుల తనిఖీలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య...

## గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరించిన కాంగ్రెస్ నేతలు

వాంకిడి మండలంలో విస్తృత ప్రచారం

**ఆసిఫాబాద్ , మే 9: ప్రజా జ్యోతి** కొమురంభీం కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండల కేంద్రంలోని సోనాపూర్, గో?యాగం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడపగడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు, ఇందిరా మహిళా శక్తి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నూలే నారాయణ,



పట్టణ అధ్యక్షుడు మండోకర్, అనిల్,యువజన అధ్యక్షులు ఉప్పుల కృష్ణ, ఓబీసీ సెల్ అధ్యక్షుడు జాబోరే గణేష్, సమేల సర్పంచ్ వద్దురే సంతోష్, నాయకులు వాడై పాండు, డికొండ మహేష్, మల్లయ్య, సెల్వట్కార్ పేంటు, శ్రీనివాస్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన అశోక్‌కు సన్మానం

బుద్ధిజం, సామాజిక సేవలో కృషికి గుర్తింపు



**ఆసిఫాబాద్ మే 9 ప్రజా జ్యోతి** లూసియానా అమెరికన్ రీసెర్చ్ యూనివర్సిటీ, పూణే నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్‌ను మాజీ జెడ్పీటీసీ అజయ్ కుమార్ మండల పాత్రికేయులు, శనివారం సన్మానించారు. బుద్ధిజంపై పరిశోధన, సామాజిక సేవలో అశోక్ చేసిన కృషికి డాక్టరేట్ లభించిందని, ఇది మండలానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు జయంత్ కుమార్, దుర్గం సునీల్ కుమార్, నదిపల్లి వెంకటేశ్వర రావు పాల్గొని శాలువాతో సత్కరించారు.

## ఇస్గాంలో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్



**మే 9, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ మండలం ఇస్గాం గ్రామం లో నూతనంగా నిర్మించ నున్న గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ భూమి పూజ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, “గౌడ కులస్తుల ఐక్యతకు, సామాజిక అభివృద్ధికి ఈ కమ్యూనిటీ హాల్ వేదిక కావాలని ఆకాంక్షించారు. శుభకార్యాలు,సభలు, సమావేశాలు నిర్వహించు కోవడానికి ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్ కు శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరిం చారు.ఈ కార్యక్రమంలో ఇస్గామ్ గ్రామ సర్పంచ్ అగ్గిల సంగీత,గౌడ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొండ్ర జగ్గ గౌడ్,గౌడ సంఘం ఇస్గామ్ అధ్యక్షుడు రంగు తిరుపతి గౌడ్,కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, 9, మే (ప్రజా జ్యోతి):** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మంచిర్యాల నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఆర్డీఓ శ్రీనివాస్ రావు, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్యతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు. వరి ధాన్యం కొనుగోలు, రవాణా, హమాలీ ల లభ్యత, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణను స్వయం సహాయక సంఘాలకు అప్పగించిన నేపథ్యంలో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం నాణ్యత, తేమ శాతం పరిశీలించి రైతులకు టోకెన్లు జారీ చేయాలని తెలిపారు. కొనుగోలు అనంతరం ధాన్యాన్ని గోదాములు, రైస్ మిల్లులకు వేగంగా తరలించే లా రవాణాశాఖ సమన్వయం చేయాలని సూచించారు. జిల్లాలో సాగవుతున్న వరి పంటలో సుమారు 65 శాతం మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోనే ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 12 రైస్ మిల్లులు పనిచేస్తున్నాయని, రోజుకు కనీసం 10 లారీలకు తగ్గకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం నిల్వ కోసం ఆరు గోదాములు అందుబా టులో ఉన్నాయని, జైపూర్ లోని సుముఖ గోదాములో 35 వేల మెట్రిక్ టన్నుల వరకు నిల్వ చేయవచ్చని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ నెలాఖరు నాటికి 80 శాతం కొనుగోళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతుల ధాన్యం తడవకుండా గోదాముల్లో భద్రపరిచే ఏర్పాట్లు చేస్తున్నామని, అవసరమైతే కొత్త గోదాములను గుర్తించి నిల్వ సదుపాయాలు కల్పిస్తామన్నారు. లారీలు, ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలింపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, హమాలీలు, గోదాముల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. మిల్లింగ్ సామర్థ్యాన్ని పెంచి రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు మరింత వేగంగా జరిగేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. దండేపల్లిలో సుమారు 40 వేల ఎకరాలు, లక్షెట్టిపేటలో 28 వేల ఎకరాలు, హాజీపూర్‌లో 6 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని తెలిపారు. అందుకు అనుగుణంగా లారీలు, హమాలీలు, నిల్వ సదు పాయాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. శాఖల వారీగా పూర్తి స్థాయి ప్రగతి నివేదికల తో అధికారులు సమావేశా లకు హాజరుకావాలని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో తలెత్తే సమస్యల ను వెంటనే పరిష్కరించేం దుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన శ్రీరాంపూర్ పోలీసులు

**నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరిక**

**రౌడీషీటర్లకు నార్కోటిక్ డ్రగ్ పరీక్షలు**



**మంచిర్యాల, 9, మే (ప్రజా జ్యోతి):** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్లకు శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్య క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ పై అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లకు భవిష్యత్తులో ఎలాంటి నేర కార్యకలాపాల్లో పాల్గొనరాదని, ప్రజల్లో భయాందో ళనలు కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. సమాజంలో బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణలో భాగంగా వారిని ప్రభుత్వ ఆసుపత్రి మంచిర్యాలకు తరలించి యూరిన్ నార్కోటిక్ డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. నిర్వహించిన పరీక్షల్లో అందరికీ నెగటివ్ ఫలితాలు వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. మాదకద్ర వ్యాల నిర్మూలన, నేరాల నియంత్రణ కోసం పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, అనుమానాస్పద కార్యకలా పాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

## ఎస్సీ సెల్ పదవులకు పోటీ

**ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరణ**



**ఆసిఫాబాద్, మే 9 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష, రాష్ట్ర స్థాయి పదవుల భర్తీ కోసం శనివారం డీసీసీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిశీలకులు సమతా సుదర్శన్, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పరిశీలకులకు స్వాగతం పలికారు. దరఖాస్తులను గాంధీభవన్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గాలకు పార్టీలో ప్రాధాన్యత ఇస్తున్నామని, నిబద్ధతతో పనిచేసే వారికి అవకాశం కల్పిస్తామని ఆత్రం సుగుణక్క పేర్కొన్నారు. గ్రంథాలయ చైర్మన్ కామ్రే అనిల్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పస్తం పోషం, కౌన్సిలర్లు రాపర్తి కార్తీక్, నిఖిల్, హనుమండ్ల సాయి, నాయకులు పాల్గొన్నారు

## ఎస్టిపిపీలో బిసి ఉద్యోగుల సంఘం సమావేశం

**నూతన లైసెన్ ఆఫీసర్‌కు అభినందనలు**



**జైపూర్ మే 9 (ప్రజా జ్యోతి)** జైపూర్ మండలంలోని ఎస్టిపిపీలో బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సింగరేణి బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు నల్లపూరి రమేష్, పేరం రమేష్ ఎస్టిపిపీని సందర్శించి సంఘం కార్యకలాపాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎస్టిపిపీ బ్రాంచ్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం లైసెన్ ఆఫీసర్‌గా ఎన్నికైన డీజీఎం వీరబ్రహ్మంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బిసి ఉద్యోగుల ప్రతినిధులతో కలిసి జీఎం ఎం. నరసింహారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం చేతుల మీదుగా వీరబ్రహ్మంకు నియామక పత్రం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘం బలోపేతానికి ఎస్టిపిపీలో ప్రత్యేక కార్యాలయ గది కేటాయించాలని నాయకులు జీఎంను కోరగా, సమస్యను పరిశీలించి సహకారం అందిస్తామని జీఎం హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. అనంతరం బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం తరపున జీఎం నరసింహారావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం బి. శంకర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్, సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయ్, జాయింట్ సెక్రటరీ మెరుగు రాకేశ్, ట్రెజరర్ అరుణ్‌తో పాటు కమిటీ సభ్యులు రవిచంద్ర, శ్యామల, నిసరుద్దీన్, రాజు, రాజేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర సేవే లక్ష్యం కావాలి

**మాజీ మంత్రి జోగు రామన్న సూచన**

**మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్‌కు సన్మానం**



**ఆసిఫాబాద్ మే 9 ప్రజా జ్యోతి** ప్రజా సేవలో నిరంతరం ఉండాలని మాజీ మంత్రి జోగు రామన్న సూచించారు. ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ శనివారం ఆదిలాబాద్‌లో జోగు రామన్నను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు రామన్న అహ్మద్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ రోహిత్, బీఆర్ఎస్ సీనియర్ నేత సయ్యద్ సాజిద్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ యునుస్ ఆక్బని అహ్మద్‌ను ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, ఫిరోజ్, ఇమ్రాన్ తదితరులు హాజరయ్యారు.

## అకాల వర్షాలకు భారీ పంట నష్టం

**ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకోవాలి**

**ఎన్ హెచ్ ఆర్ సి జిల్లా అధ్యక్షులు ఎం.ఏ. వకీల్**



**ఖానాపూర్ మే 9( ప్రజా జ్యోతి )**ఉమ్మడి జిల్లా ఆదిలాబాద్, జిల్లాలలో మే 2026 ప్రారంభం నుండి కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలుల ద్వారా అన్నదాతలకు త్రీవ నష్టం కలిగించాయని ఈ అకాల వర్షాల వలన రైతులు పెట్టిన పంట పెట్టుబడి కూడా రాని పరిస్థితినీ ఎదుర్కొంటున్న దృశ్య రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఎన్ హెచ్ ఆర్ సి అధ్యక్షులు యమ్ ఎ వకిల్ ప్రకటనలో కోరారు ఉమ్మడి జిల్లాలో వరి, మొక్కజొన్న, జొన్న, చేతికి వచ్చిన పంటలు భారీగా నష్ట నష్టపోవడం తో పాటు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులకు భారీ నష్టం సంభవించిందన్నారు ముఖ్యంగా చేతికి వచ్చిన మామిడి పంట కూడా నష్టం కలిగింది. ముఖ్యంగా అకాల వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో నష్టపోయిన పంట నష్టం గురించి వ్యవసాయ అధికారులచే పంట నష్టం సర్వే ను చేయించి, నివేదికను ప్రభుత్వానికి పంపించి, నష్టపరిహారం రైతులకు చెల్లించాలని రైతుల వద్దనున్న తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పిడుగు పాటుతో మృతి చెందిన పశువులకు నష్టపరిహారం చెల్లించి, భవిష్యత్తులో ధాన్యం వర్షాలకు తడవకుండా ఉండాలంటే వ్యవసాయ మార్కెట్ కమిటీల పాల్ తీన్ కవర్లు రైతులకు సరఫరా చేయాలని, తక్షణమే ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించేల ముఖ్య మంత్రిఏనుముల రేవంత్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు జిల్లా ఇంచార్జ్ మంత్రి స్థానిక ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ తక్షణ చర్యలు తీసుకొని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్ ప్రధాన కార్యదర్శి, మోజెస్ జిల్లా ఉపాధ్యక్షులు, నిర్మల్ పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ మజర్, పిల్లి శ్రీనివాస్, జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోరుతున్నారు

# కోయగూడెం ఓసీ, జేవీఆర్ ఓసీ ప్రైవేటీకరణకు రాజకీయ స్వార్ధ ప్రయోజనాలే కారణం

**సింగరేణి యాజమాన్యాన్ని వేలంపాటలో పాల్గొనకుండా అడ్డుకున్నదే గెలిచిన సంఘాలు**

**తెలంగాణ ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.53 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి**

**ఏఐటీయూసీ -- ఐఎన్టీయూసీ సంఘాల వైఫల్యమే కార్మికుల దుస్థితికి మూలం**

**సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ( ఏపీకే ఎం ఎస్ -- బి ఎం ఎస్)**



**మంచిర్యాల, 9,మే (ప్రజా జ్యోతి):** కోయగూడెం ఓసీలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో బి. దశరథం ఫిట్ సెక్రటరీ అధ్యక్షతన శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ గేట్ మీటింగ్‌కు ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి మాధవ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కోయగూడెం ఓసీ, జేవీఆర్ ఓసీ ప్రైవేటీకరణకు ప్రధాన కారణం రాజకీయ స్వార్థ ప్రయోజనాలేనని తీవ్రంగా విమర్శించారు.సింగరేణి యాజమాన్యం వేలంపాటల్లో పాల్గొని ఈ బొగ్గు గనులను సంస్థ ఆధీనంలో కొనసాగించే అవకాశం ఉన్నప్పటికీ, రాజకీయ నాయకుల ఒత్తిళ్లు మరియు అనాలోచిత జోక్యాల కారణంగా యాజమాన్యాన్ని వేలంపాటలో పాల్గొనకుండా అడ్డుకున్నారనిఆరోపించారు. ఫలితంగా ఈ గనులు రాజకీయ నాయకులకు అనుబంధంగా ఉన్న పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు.ఈ పరిణామాలకు గెలిచిన సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీతో పాటు ఇతర కార్మిక సంఘాలే ప్రధాన బాధ్యత వహించాల్సి ఉంటుందని విమర్శించారు ఆ సమయంలో యాజమాన్యం వేలంపాటలో పాల్గొనకుండా అడ్డుకోవడం లో ఈ సంఘాలు కీలక పాత్ర పోషించాయని ఆరోపించారు. ఇప్పుడు మాత్రం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నకిలీ పోరాటాల పేరుతో కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తరువాత గత భారత రాష్ట్ర సమితి ( బిఆర్ఎస్) ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కూడా సింగరేణిపై తీవ్రమైన రాజకీయ జోక్యం చేస్తూ సంస్థను ప్రభుత్వ ఆదేశాలకు బానిసగా మార్చాయని ఆరోపించారు. ఉత్పత్తి అవుతున్న బొగ్గులో సగానికి పైగా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలే వినియోగిస్తున్నప్పటికీ, వాటి బిల్లులను సకాలంలో చెల్లించకపోవడం వల్ల సింగరేణి తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిం దన్నారు.ట్రాన్స్కో, జెన్కో తదితర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన సుమారు 53 వేల కోట్లకు పైగా బకాయిల ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ బకాయిలు చెల్లించక పోవడం వల్ల సంస్థ కార్మికులకు జీతాలు చెల్లించడానికి కూడా అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు సంవత్సరాలు గా కార్మికుల ప్రధాన సమస్యలైన మెడికల్ బోర్డులు, కార్మికుల సొంతింటి కల, పేర్క్‌పై ఇన్‌కమ్ టాక్స్ రీయింబర్స్‌మెంట్, క్యాడర్ స్కీములు, బకాయిల సమస్యలపై ఒక్కరోజు కూడా రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేయని గెలిచిన సంఘాలు కార్మికులకు న్యాయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందానికి సంబంధించి జేబీసీసీఐ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ ( బిఎంఎస్) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా గేట్ మీటింగ్‌లు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు.అనారోగ్యంతో బాధపడుతూ విధులు నిర్వర్తిస్తున్న వందలాది మంది కార్మికులకు వెంటనే మెడికల్ బోర్డులు నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీఎస్ పవన్ కుమార్, ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షులు నాయిని సైదులు, జాయింట్ సెక్రటరీ బానోతు రాజేష్ ఓవర్మన్, బి. దశరథం, హెచ్ హరీష్, పి రవికుమార్, పి పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథంతో యువత ముందుకు రావాలి అబ్దుల్ రహమాన్

**తోటివారికి సహాయం చేయడమే నిజమైన తృప్తి**

**సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిదీ అన్న జర్నలిస్టు నేత**



**ఆసిఫాబాద్ మే 9 ప్రజా జ్యోతి** యువత సమాజ సేవలో నిరంతరం ముందుండాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో వారసంత సందర్భంగా యుబీవై (ఖదీ) ఫౌండేషన్ అధ్యక్షుడు ఉబెద్ బీన్ యాహియా (తారిఖ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు అంబలి అందించారు. ఎండ తీవ్రత దృష్ట్యా సామాన్య ప్రజల దాహార్తిని తీర్చేందుకు తారిఖ్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా అంబలి పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. తోటి వారికి సహాయం చేయడంలోనే నిజమైన తృప్తి ఉంటుందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత చాటుకోవాలని సూచించారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటే సమాజంలో సానుకూల మార్పు వస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యుబీవై ఫౌండేషన్ అధ్యక్షుడు ఉబెద్ బీన్ యాహియా, యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, ఫౌండేషన్ సభ్యులు మెహరాజ్ హుస్సేన్, తహేర్, అబ్దుల్ అఖిబ్, ఉమర్ ఆఫ్ఫారి తదితరులు పాల్గొన్నారు

# సింగరేణి సంస్థకు శుభవార్త....

**సింగరేణి భవిష్యత్తు కోసం 9 కొత్త గనులు**

**నూతన గనులపై శనివారం సీఎండీ ప్రత్యేక సమీక్ష రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో ముమ్మర ప్రయత్నాలు**

**ఈ ఏడాది 3, వచ్చే ఏడాది మరో 2 కొత్త గనుల ప్రారంభానికి చర్యలు**

**రాష్ట్ర ఇంధన అవసరాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కొనసాగింపునకు నిర్ణయం**

**మంచిర్యాల, 9, మే (ప్రజా జ్యోతి):** సింగరేణి సంస్థకు ఉజ్వల భవిష్యత్తు అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో కొత్త గనుల ఏర్పాటుకు ముమ్మర సన్నాహాలు చేస్తోంది. బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో మూతపడుతున్న గనుల ఉత్పత్తిని భర్తీ చేయడానికి, అక్కడ పనిచేస్తున్న కార్మికులకు ఉపాధిని కొనసాగించడానికి, పెరుగుతున్న రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చడానికి కొత్త గనులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన సన్నాహాలు, అనుమతుల ప్రక్రియలను వేగవంతం చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించింది. దీనిపై సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి సింగరేణి ప్రాంతంలో 9 ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించి, కేంద్ర బొగ్గు, అటవీ, పర్యావరణ శాఖల అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించింది. ఈ ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ముఖ్యంగా భట్టి విక్రమార్క ఇప్పటికే రెండుసార్లు దేశ రాజధానికి వెళ్లి సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై కొత్త గనులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని, రాష్ట్ర ఇంధన అవసరాల దృష్ట్యా ఈ గనులు అత్యవసరమని వివరించారు. భట్టి విక్రమార్క చొరవతో ఇప్పటికే మూడు గనులకు అనుమతులు లభించాయి. వీటిలో ఒడిశాలోని నైనీ బ్లాక్‌కు సంబంధించి ఒడిశా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించారు. దాదాపు దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో గత ఏడాది కార్యరూపం దాల్చింది. అలాగే కొత్తగూడెంలోని వీకే కోల్ మైన్ కూడా దాదాపు అన్ని అనుమతులను పూర్తి చేసుకుని బొగ్గు ఉత్పత్తికి సిద్ధమైంది.

**కొత్త ప్రాజెక్టులతో 20 ఏళ్ల పాటు బొగ్గు ఉత్పత్తి.......**

2027-28 నాటికి సింగరేణిలో నాలుగు గనులు మూతపడనున్నాయి. దీంతో ఏడాదికి 12.51 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోనుంది. అయితే కొత్తగా ప్రారంభించనున్న ఐదు ప్రాజెక్టుల ద్వారా ఈ లోటును భర్తీ చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సింగరేణి రూపొందించిన 9 కొత్త ప్రాజెక్టుల ద్వారా మరో 20 సంవత్సరాలకు పైగా ఉత్పత్తి తగ్గకుండా రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. సింగరేణి ప్రాంతంలో ఇప్పటికే బొగ్గు తవ్వకాలు పూర్తిచేసుకుని మూతపడిన భూగర్భ గనుల లోతుల్లో ఇంకా మిగిలి ఉన్న బొగ్గు ఖనిజాన్ని వెలికితీయ డానికి ఈ ప్రాజెక్టులను చేపడుతున్నారు. అలాగే ప్రస్తుతం నడుస్తున్న ఓపెన్‌కాస్ట్ గనులకు కొనసాగింపుగా కూడా కొన్ని ప్రాజెక్టులు ఉన్నాయి.





**కొత్త ప్రాజెక్టుల వివరాలు............**

కొత్తగూడెం ఏరియాలో బొగ్గు తవ్వకాలు పూర్తిచేసిన భూగర్భ గనుల నుంచి 190 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు గల వీకే కోల్ మైన్ ప్రధాన ప్రాజెక్టుగా భావిస్తున్నారు. ఈ గనికి సంబంధించిన దాదాపు అన్ని అనుమతులు లభించగా, ఓవర్‌బర్డెన్ తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నారు. మిగిలిన గనులు, వాటి బొగ్గు నిల్వల వివరాలు ఇలా ఉన్నాయి. జేకే ఓపెన్‌కాస్ట్ గని (ఇల్లందు ఏరియా) -- 19.68 మిలియన్ టన్నులు

రామగుండం ఓసీ-1 విస్తరణ ప్రాజెక్టు (రామగుండం-3 ఏరియా) -- 181.60 మిలియన్ టన్నులు. గోలేటి ఓపెన్‌కాస్ట్ (బెల్లంపల్లి ఏరియా) -- 38.98 మిలియన్ టన్నులు. ఎంవీకే ఓపెన్‌కాస్ట్ -- 30.34 మిలియన్ టన్నులు. మణుగూరు ఓపెన్‌కాస్ట్ ఎక్స్‌టెన్షన్ (మణుగూరు ఏరియా) 40.45 మిలియన్ టన్నులు

ఆర్‌కేపీ ఓసీపీ ఫేజ్-2 (మందమర్రి ఏరియా) -- 34.42 మిలియన్ టన్నులు

పీకే కోల్ మైన్, కొండాపూర్ (మణుగూరు ఏరియా) - 62 మిలియన్ టన్నులు

**నూతన గనులపై సీఎండీ ప్రత్యేక సమీక్ష...........**

కాగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణిలో కొత్త గనులను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు ఆయా శాఖల అధికారులతో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి శనివారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఈ ఏడాది మూడు గనుల నుంచి ఉత్పత్తి ప్రారంభించాలని, దీనికి అవసరమైన మిగిలిన అనుమతులను వెంటనే పొందేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమల రావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, అడ్వైజర్ (ఫారెస్ట్రీ) మోహన్ పరిగెన్, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, జీఎం సీపీపీ ఎ. మనోహర్, కొత్తగూడెం నుంచి జీఎం (పీపీ) జి. దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చైర్‌పర్సన్

**రామకృష్ణాపూర్, మే 9(ప్రజా జ్యోతి):** మల్లికార్జున నగర్‌లో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన చాపల రమేష్ ఇంటిని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి రాజారమేష్ సందర్శించి బాధిత కు టుంబాన్ని పరామర్శించారు.ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం అదృష్టకరమని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపు న సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొప్పి రాజశేఖర్, బబ్బె ర స్వర్ణలత బీఅ ర్ ఎస్‌నాయ కులు సుధాకర్, టైలర్ రాజు,శివ అవినా ష్ తదితరులు పాల్గొన్నారు.



## పిచరలో తీరిన తాగునీటి కష్టాలు



**నేరడిగొండ మే 09 (ప్రజాజ్యోతి ):**మండలంలోని పీచర గ్రామంలో తాగునీటి బోరు దెబ్బతినడంతో తలెత్తిన నీటి ఎద్దడిని సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ సమర్థవంతంగా పరిష్కరించారు. బోరు పాడవడంతో గ్రామ ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆమె వెంటనే స్పందించారు.ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వ్యక్తిగత పర్యవేక్షణలో యుద్ధప్రతిపాదికన బోరు మరమ్మతు పనులను పూర్తి చేయించారు. సకాలంలో స్పందించి నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిగాం గ్రామంలో ఈదురుగాలులతో చెట్టు రోడ్డుపై పడి రాకపోక లకు అంతరాయం ఏర్పడడంతో

**ఘటన స్థలానికి చేరుకున్న సర్పంచ్ వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టడంతో**

**చెట్టు తొలగింపుపై సర్పంచ్ రాజక్కకు అభినందించి ప్రశంసించిన గ్రామస్తులు:**



**మే 9, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండ లంలో వివిధ గ్రామాలతో పాటు పారిగాం గ్రామంలో శనివారం సాయంత్రం ఈదురు గాలుల ప్రభావం తో కురిసిన భారీ వర్ష బీభత్సవానికి ప్రధాన రహదారి పై భారీ చెట్టు నేలకూలిన ఘటనకు స్థానిక సర్పంచ్ రాజక్క సిబ్బంది తో కలిసి వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న సర్పంచ్ సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో రహదారిపై పడిన చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, వేగంగా స్పందించిన సర్పంచ్ రాజక్క సిబ్బంది చర్యలతో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది. ముఖ్యంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

# సింగరేణిలో కమ్ముతున్న సమ్మె మేఘాలు..?

**ఈనెల 15 తర్వాత సమ్మె నోటీసు ఇస్తామంటున్న కార్మిక సంఘాలు**

**పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యమంటున్న సంఘాలు**

**" సమ్మె" తప్ప మరో మార్గం లేదు" అంటున్న నేతలు**

**"చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం" అంటున్న సింగరేణి యాజమాన్యం**

**మంచిర్యాల, 9 మే (ప్రజాజ్యోతి):**సింగరేణిలో సమ్మె మేఘాలు కమ్ముతున్నాయి . సింగరేణి సంస్థలో పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యలపై, సింగరేణి కి రావలసిన వేల కోట్ల బకాయిలపై, తదితర వాటిపై ఇటు సింగరేణి యాజమాన్యం కాని , అటు ప్రభుత్వము కాని స్పందించక పోవడం తో కార్మిక సంఘాలు అసహనానికి గురి అవుతున్నాయి . ఒకే వేదికగా ముందుకు వెళ్లాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది .అందుకు ఉదాహరణగా ఇటీవల ఒక దగ్గర రహస్యంగా సమావేశం కావడం ఊతమిస్తోంది . సింగరేణి సంస్థలో పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యల పరిష్కారం కోసం జాతీయ కార్మిక సంఘాలు సమ్మె బాట పట్టే దిశగా అడుగులు వేస్తున్నాయి. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నుంచి సమస్యలపై స్పష్టమైన స్పందన లేకపోవడంతో ఈనెల 15 తర్వాత సమ్మె నోటీసు ఇవ్వాలని కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు సమాచారం. జూన్ నెలలో సమ్మె చేపట్టే అవకాశాలు ఉన్నాయని కార్మిక వర్గాల్లో చర్చ జరుగుతోంది. సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఎన్నికైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ), ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందిన ఐఎన్టీయూసీతో పాటు సీఐటీయూ, టీబీజీకేఎస్, హెచ్ఎంఎస్, బీఎంఎస్ తదితర కార్మిక సంఘాలు సమ్మె కార్యాచరణపై చర్చలు జరుపుతున్నాయి. కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారం ప్రభుత్వంతో, యాజమాన్యంతో చర్చలు జరిపే అధికారిక అవకాశం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకే ఉండటంతో ముందడుగు వేయాల్సిన బాధ్యత కూడా వాటిపైనే ఉందని కార్మిక వర్గాలు భావిస్తున్నాయి.సింగరేణిలో నూతన గనుల ఏర్పాటు, మెడికల్ బోర్డు సమస్యలు, డిపెండెంట్ ఉద్యోగాల పెండింగ్, ప్రభుత్వం నుంచి రావాల్సిన 54 వేల కోట్ల బకాయిలు, కార్మిక సంక్షేమ అంశాలు వంటి కీలక సమస్యలపై ఎన్నిసార్లు చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో సమ్మె దిశగా వెళ్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. 2023 డిసెంబర్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగిన తర్వాత పలువురు ఉన్నతాధికారులు మారినా కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని సంఘాలు ఆరోపిస్తున్నాయి. స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించిన అంశాలు అమలుకాకపోవడం, కాలనీల సమస్యలు పరిష్కారం కాకపోవడం, గ్రీన్ ఛానల్ వ్యవస్థ నిలిచిపోవడం వంటి కారణాలతో కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతోందని చెబుతున్నారు. ప్రస్తుతం సంస్థలో కార్మికుల సంఖ్య తగ్గుతున్నప్పటికీ అధికారుల సంఖ్య మాత్రం అధికంగానే కొనసాగుతోందని, కార్మికులపై మాత్రమే ఒత్తిడి పెంచడం సరికాదని సంఘాలు అంటున్నాయి. కొత్త గనుల్లో కూడా పర్మినెంట్ కార్మికులతోనే పనులు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మిక సంఘాలు ప్రధానంగా 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులను వెంటనే పరిష్కరించాలని, డిపెండెంట్ ఉద్యోగాల పెండింగ్ కేసులను సెటిల్ చేయాలని, డిస్మిస్ అయిన కార్మికులకు తిరిగి ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. మైనింగ్, క్రాఫ్ట్, డ్రైవర్‌మెన్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు కొత్త గనులు ప్రారంభించి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరుతున్నాయి. అలాగే సింగరేణికి రావాల్సిన 54 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల పిల్లలకు పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని, కాలనీల్లో పర్యటనలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు .

**కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమానికి ముందుండేది**

**-ఐఎన్టీయూసీ ప్రాతినిధ్య సంఘం సెక్రటరీ జనరల్ బి. జనక ప్రసాద్**

సింగరేణిలోని కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్య మంత్రి, సింగరేణి సీఎండీ దృష్టికి తీసుకెళ్తాము. సింగరేణిలోని సమ స్యలపై ప్రభుత్వం సానుకూలంగానే ఉంది. ఐఎన్టీయూసీ కార్మిక సం ఘం తరపున ప్రభుత్వం పై ఒత్తిడి పెంచుతూనే ఉన్నాము. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు మా పోరాటం కొనసాగు తుంది.

**సమ్మె నోటీసు ఇస్తాము ...**

**-వాసిరెడ్డి సీతారామయ్య , గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు , ఏఐటీయూసీ......**

ఐదు జాతీయ కార్మిక సంఘాలతో పాటు మొత్తం 13 కార్మిక సంఘాలు కలిసి ఈనెల 15 తర్వాత సమ్మె నోటీసు ఇస్తాం. ప్రభుత్వం, యాజమాన్యం సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోతే సమ్మె తప్పదు. గనులు, డిపార్ట్‌మెంట్‌లు, రవాణా, ఓటీ పనులు పూర్తిగా స్థంభించేలా ఉద్యమం నిర్వహిస్తాం.

**కొత్త గనుల ఏర్పాటు , సింగరేణికి రావాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిల కోసం**

**- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు మందా నర్సింహారావు**

సింగరేణికి రావాల్సిన రూ. 54 వేల కోట్ల బకాయిల కోసం ఇప్పటికే హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించాం. ఇతర సమయలపై కూడా వినతిపత్రాలు ఇచ్చినా స్పష్టత లేదు, స్పందన లేదు. సంస్థ ఆర్థికంగా బలపడాలంటే ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలి. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తాం.

**ఉద్యోగాలు, సంక్షేమం, డిపెండెంట్ కేసులు, మెడికల్ బోర్డు సమస్యలను పరిష్కరించాలి**

**-తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిజంగా పోరాడింది తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘమే. గతంలో కార్మికులకు అధిక లాభాల వాటా సాధించడంలో కూడా మా సంఘం కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు కార్మికుల సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి. ఉద్యోగాలు, సంక్షేమం, డిపెండెంట్ కేసులు, మెడికల్ బోర్డు సమస్యలపై అన్ని సంఘాలతో కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నాం.

**సమ్మె నిర్ణయం సరైంది కాదు**

**-సింగరేణి యాజమాన్యం**

సమ్మె నిర్ణయం సరి కాదని భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత సంస్థ ఆర్థిక పరిస్థితులు సవాళ్ల మధ్య ఉన్నాయని, ఈ సమయంలో సమ్మె వల్ల సంస్థతో పాటు కార్మికులకు కూడా నష్టం జరుగుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, సమ్మెలకు దూరంగా ఉండి సంస్థ అభివృద్ధికి సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేస్తోంది. సమ్మె వల్ల బొగ్గు ఉత్పత్తి, రవాణాపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని, ఇప్పటికే మార్కెట్ పరిస్థితులు క్లిష్టంగా ఉన్న నేపథ్యంలో సమ్మె సంస్థపై మరింత భారం మోపుతుందని అధికారులు అంటున్నారు.

**ప్రభుత్వం, యాజమాన్యంల స్పందన ఏమిటి ..???**

సింగరేణిలో కార్మిక సంఘాల సమ్మె హెచ్చరికలతో ప్రభుత్వం, యాజమాన్యం ఎలా స్పందిస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సమస్యల పరిష్కారానికి చర్చల మార్గం పడుతుందా..? లేక సమ్మె దిశగా పరిస్థితులు వెళ్తాయా..? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. ఒకవేళ తప్పని సరిగా సింగరేణి సమ్మె మేఘాలు కమ్మి సమ్మె జరిగితే బొగ్గు ఉత్పత్తి ,ఉత్పాదకలపై ప్రభావం పై భారీ ఆర్థిక నష్టం ,ఉద్యోగులకు వేతనాల నష్టం వాటిల్లుతుంది .

## గోడల పంపులో పోచమ్మ ఆలయ ఉత్సవాలు ప్రారంభం



**ఖానాపూర్ మే 9 (ప్రజా జ్యోతి )**ఖానాపూర్ మండలంలోని గోడలపంపు ఎ స్సీ కాలనీలో గల గడ గొండ పోసమ్మ ఆలయం లో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పండితులు ప్రశాంత్ వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు ఆదివారం బోనాల పండుగ సందర్భంగా పోతరాజుల ప్రదర్శనలతో ప్రత్యేక ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కట్ల మల్లేష్, ఆమంధ సుదర్శన్, కట్ల పోసన్న, దూడ శంకర్, కొత్తూరు గంగారాం, చిలుముల లింగన్న, గాజుల భూమరాజం, గాజుల నర్సయ్య, కరిపే ప్రకాష్, చిలుముల నర్సయ్య, నాగుల శంకర్ గౌడ్, గాజుల సురేష్, చిలుముల రవి, కోరుట్ల అశోక్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

**ఈ నెల 20న అదిలాబాద్‌లో మెగా జాబ్ మేళ**

**50కి పైగా కంపెనీలు.. 5 వేల ఉద్యోగ అవకాశాలు**

**మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్**

**ఆదిలాబాద్ టౌన్, మే 9, (ప్రజా జ్యోతి)**అదిలాబాద్ పట్టణంలోని ని రుద్యోగ యువతీ యువకుల కు అద్భుతమైన అవకాశం లభించనుంది. రాష్ట్ర ప్రభు త్వం, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన మా వల లోని చిలుకూరి లక్ష్మీ గా ర్డెన్స్‌లో భారీ మెగా జాబ్ మే ళా నిర్వహిస్తున్నట్లు ఆదిలా బాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ వెల్ల డించారు. మున్సిపల్ కార్యా లయంలో వార్డు ఆఫీసర్లు, అ ధికారులతో నిర్వహించిన ప్ర త్యేక సమావేశంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. ప ట్టణ పరిధిలోని 49 వార్డుల నుంచి అర్హులైన అభ్యర్థులంద రూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఐటీ, ఫార్మా, బ్యాం కింగ్, రిటైల్ సహా వివిధ రం గాలకు చెందిన 50కి పైగా ప్ర ముఖ కంపెనీలు పాల్గొంటు న్నాయి అన్నారు. సుమారు 5,000కు పైగా ఖాళీలు అందు బాటులో ఉన్నాయి అని పే ర్కొన్నారు.18 నుంచి 33 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, వి ద్యార్హత కలిగిన వారు దరఖా స్తు చేసుకోవచ్చని, అభ్యర్థుల నైపుణ్యం, అర్హతను బట్టి ఏడాదికి (సంవత్సరానికి)రూ. 1.5 లక్షల నుండి రూ. 4 లక్షల వరకు జీతం లభిస్తుందనీ అన్నారు. అదిలాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగుల ఉపాధి కల్పనే లక్ష్యంగా, ఈ మేళా ముఖ్య ఉద్దేశమని ఉదయం 10 గంటల నుంచే మేళా ప్రారంభమవు తుంది కావున, నిరుద్యోగ యువత తమ ధ్రువపత్రాలతో హాజరై, తమ ప్రతిభను చాటుకుని ఉద్యోగా లు పొందాలి అని మున్సిపల్ చైర్ పర్సన్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ సందీప్, విశ్రాంత స్టేట్ సీఈఓ వెంకటేశ్వర్లు, బీసీ స్టడీ సర్కిల్ ఇంచార్జ్ ప్రవీణ్, వైస్ చైర్మన్ రోహిత్, కౌన్సిలర్లు ఇజ్జగిరి సంజయ్, మెహబూబ్, పర్వేజ్, గజ్జల విజయ్, వసంత్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## దుబార్‌పేట్ కాలనీల్లో డోర్ టు డోర్ సర్వే నిర్వహించిన యు ఆర్ ఎస్ ఆదిలాబాద్ సిబ్బంది



**ఇచ్చోడ మే 9 (ప్రజాజ్యోతి )** ఇచ్చోడ మండలంలోని దుబార్ పేట్ లోని కాలనీల్లో శనివారం యుఆర్ ఎస్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో డోర్ టు డో ర్ సర్వే నిర్వహించారు. దుబార్ పేట్ లోని ఎ బి సి కాలనీల్లో డోర్ టుడోర్ సర్వే జరిపారు. ఈ సర్వేలో పాఠశాలకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తిం చడం, వారి విద్యా పరిస్థితు లను తెలుసుకోవడం, తిరిగి విద్యా లోకి తీసుకురావడం ప్రధాన లక్ష్యంగా చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్ర మంలో యు ఆర్ ఎస్ ఆదిలా బాద్ జిల్లా సిబ్బంది గణేష్, రవికాంత్ రెడ్డి పాల్గొని కాలనీల్లో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రు లతో మాట్లాడారు. పిల్లల చదువు, పాఠశాల హాజరు, ఆర్థిక, కుటుంబ పరిస్థితులపై వివరాలు సేకరించారు. విద్యకు దూరమైన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించి వారికి మె రుగైన భవిష్యత్తును కల్పించేందుకు ఇటువంటి సర్వేలు ఉపయోగపడతా యని వివరించారు. మరిన్ని విషయాల కోసం8500023457, 9705108585ని సంప్రదించాలని సిబ్బంది పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమా న్ని అభినందిస్తూ విద్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

## సిర్పూర్(టి)లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం

**ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం**

**పారిగాం గ్రామంలో చెట్టు నేలకూలి రాకపోకలకు అంతరాయం:**





**మే 9, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** కొము రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్ష బీభత్సం ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం పారిగావ్ గ్రామంలో సాయంత్రం కురిసిన అకాస్మిక ఇదురు గాలులతో కూడిన వర్ష బీభత్సం సృష్టించడం తో బలమైన గాలుల ప్రభావంతో గ్రామంలోని ప్రధాన రహదారిపై భారీ చెట్లు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను మర్యాదపూర్వకంగా కలిసిన హౌసింగ్ పిడి శ్రీనివాసరెడ్డి



**ఖానాపూర్ మే 9( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివా సరెడ్డి స్థానిక ఎమ్మెల్యే వేడమ బొజ్జు పటేల్ ను మర్యాదపూర్వ కంగా క్యాంపు కార్యాలయంలోకలిసి సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జరుగుతు న్న జరగబోయే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పారదర్శకంగా త్వరతగతిన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పిడిని ఎమ్మెల్యే ఆదేశించారు ఇందిరమ్మ లబ్దిదారులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సిబ్బందిని విధులు నిర్వహించేలా ఆదేశించాలని అన్నారు ఖానాపూర్ మున్సిపాలిటీ తో పాటు ఖానాపూర్ పాత తాలూకాలో ఇళ్ల నిర్మాణాలకు రెండవ విడతలో అర్హులైన వా రందరికీ ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు

## పేదింటి పెళ్లికి ఆ దపడుచుల అండ

**45 వేల ఆర్థిక సహాయం**



**నేరడిగొండ మే 09 ప్రజాజ్యోతి:**నేరడిగొండ మండలంలోని మంగల్ మోట (తర్నం బి) గ్రామం ఆదర్శానికి వేదికైంది. కట్న కానుకలను నిషేధిస్తూ గ్రామ పెద్దలు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ఒక నిరుపేద యువతి వివాహానికి బాటలు వేసింది. మంగల్ మోట గ్రామంలో కట్న కానుకలు ఉండకూడదని గ్రామ పటేల్, పెద్దలు గట్టి తీర్మానం చేశారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన కుంరం రజిత వివాహం సారంగాపూర్ మండలం ఇప్పచెల్మెమ్మ గ్రామానికి చెందిన ఆత్రం దేవురావ్ తో నిశ్చయమైంది. కట్నంతో సంబంధం లేని ఈ పెళ్లికి గ్రామస్తులు అండగా నిలిచారు. గ్రామంలోని 62 కుటుంబాలకు చెందిన ఆడపడుచులు తమవంతుగా రూ. 45,550 పొదుపు మొత్తాన్ని వధువుకు ఆర్థిక సాయంగా అందజేశారు. ఆదివారం నాడు సాంప్రదాయ పద్ధతిలో గ్రామ పెద్దల సమక్షంలో ఈ వివాహం అత్యంత వైభవంగా జరిగింది. కట్నం లేని పెళ్లి జరిపించి, ఆర్థిక సాయం అందించిన గ్రామస్తులను పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కుంరం భీంరావ్, అమృత రావు, పేందుర్ మారుతి, సిడం శ్యాంరావ్, కుంరం గంగారాం, జుగ్నాక్ నాందేవ్, ఉప సర్పంచ్ ఆత్రం ఈశ్వర్, మాజీ ఉప సర్పంచ్ తోడసం మన్ను, యూత్ సభ్యులు మడవి తుకారాం, మెస్రం ప్రవీణ్, తొడసం రవి తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**నేరడిగొండ మే 09 (ప్రజాజ్యోతి):**నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన రాథోడ్ లింబాజీ కుమారుడి వివాహ వేడుక మండల కేంద్రంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వధూవరులు నూతన దాంపత్య జీవితంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వివాహ వేడుకలో వివిధ మండలాలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు అదిలాబాద్ జిల్లా కాంగ్రె స్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ స మీక్ష సమావేశం



**ఆదిలాబాద్ బ్యూరో, మే 8 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ సమీక్ష సమావేశం నేడు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఒక ప్రక టనలో తెలిపారు. ఉద యం 10 గంటలకు, అదిలా బాద్ డిసిసి కార్యాలయంలో అదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ సమీక్ష సమా వేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అబ్జర్వర్ సమత సుదర్శన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిలతో పాటు ఆయా నియోజకవర్గాల ఇన్చార్జులు తప్పనిసరిగా పాల్గొనాలని, ఈ సమావేశంలో ముఖ్యంగా దళిత విభాగం జి ల్లా అధ్యక్షుల కోసమై దరఖా స్తులు స్వీకరించ బడునని, దీని తోపాటు రాష్ట్ర విభాగంలో పని చేయుటకు ఆసక్తిగా ఉన్న వారి దరఖాస్తులు స్వీకరిం చ బడునని, ముఖ్యంగా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ను పటిష్టం చేయడంతో పాటు దళిత వ ర్గాల సమాజ, సామాజిక, ఆర్థిక, రాజకీయ, స్థితిగతులను తెలుసుకొని కాంగ్రెస్ పార్టీలో పార్టీ పదవులలో నామినేటెడ్ పదవులలో వీరికి సముచిత న్యాయం సామాజిక న్యాయ కోణంలో సమీక్షించి దళిత విభాగాన్ని మరింత పటిష్టం చేసే కార్యక్రమంలో భాగంగాఆయా జిల్లాల దళిత నాయకుల సల హాలు సూచనలు స్వీకరించి రాజేంద్రపాల్ గౌతం ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ జాతీయ అ ధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కు మార్ గౌడ్, ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కవంపల్లి సత్యనారా యణ, ఈ నివేదికను అందజే యడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని దళిత విభాగం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సద్వి నియోగం చేసుకొని కాంగ్రెస్ పా ర్టీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# సిర్పూర్(టి) నియోజక వర్గంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు

## చింతల మానేపల్లి మండల అధ్యక్షులు గోమాసే లాంచ్ ఆధ్వర్యంలో

## పోడు రైతుల కమిటీ ఏర్పాటుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న:

## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ ఉద్యమకారులు గోలెం వెంకటేశం:



**మే 9 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు చింతల మానేపల్లి మండలం అధ్య క్షులు గోమాసె లాంచ్ ఆధ్వర్యంలో పోడు భూమి సాగు చేసుకుంటున్న వ్యవ సాయ దారుల కమిటీ ఏర్పాటు చేశారు.పోడు కమిటీ ఎన్నికల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు గోలెం వెంక టేశం ముఖ్య అతిథి గాపాల్గొని మాట్లాడు తూ కార్జెల్లి శివారులో బీద రైతులు వ్యవసాయం చేస్తూ కుటుంబం తో జీవనం కొనసాగిస్తున్నా రని అన్నారు.అట్టి 170 ఎకరాల భూమిలో 70 ఎకరాలు ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా కంచ పేరుతో లాక్కునే ప్రక్రియ చాలా దారుణ మని అన్నారు.నియోజక వర్గ ఎమ్మెల్యే హరీష్ బాబు చోద్యం చూస్తున్నట్లు పట్టింపు లేని విధంగా ఉండడం దారుణమని అన్నారు. ఎన్నికల ముందు పోడు వ్యవసాయం చేసే రైతులకు పట్టాలిప్పించే దాకా నిదుర పోనని, వదలననీ పురుషోత్తం రావుకు పుట్టలేదని ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకొని ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పోడు రైతులను పట్టించుకోక పోవడం హాస్యస్పదంగా ఉందని అన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పోడు రైతులకు పట్టాలు ఇచ్చిన సంగతి గుర్తు చేస్తూ ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపోడు రైతులకు పట్టాలు ఎందుకు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. సిర్పూర్ (టి) నియోజక వర్గంలోని ప్రతి పోడు రైతులకు పట్టాలు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూముల కమిటీ అధ్యక్షులు దుర్గం బాపురావు,,కార్యదర్శిగా తోటపల్లి నారాయణ ఎన్నుకు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సిర్పూర్(టి) నియోజకవర్గ యూత్ కన్వీనర్ కాసిపాక రాజు, బిఆర్ఎస్ పార్టీ కర్జెలి గ్రామ అధ్యక్షులు రౌతు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌ను ఢీకొట్టిన 'బ్లేడ్' ట్రాక్టర్.. ముగ్గురికి తీవ్ర గాయాలు

## వివాహానికి వెళ్లి వస్తుండగా సిర్పూర్(టి) కోర్టు వద్ద ఘటన

## మెరుగైన వైద్యం కోసం శాతగాత్రులను మంచిర్యాలకు తరలింపు:



**మే 9, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి), మండల కేంద్రంలోని జెడ్ పి ఉన్నత పాఠశాల, కోర్టు సమీపం వద్ద బ్లేడ్ ట్రాక్టర్ బైక్ ఢీకొని చోటు చేసు కున్న ప్రమాదా ఘటనలో ముగ్గురి తీవ్రంగా గాయ పడ్డారని స్థానికులు తెలిపారు. వివాహ వేడుక కు హాజరై సంతోషంగా తిరిగి వస్తున్న ఆ యువకుల పాలిట ఓ బ్లేడ్ ట్రాక్టర్ శాపంగా మారింది. అతి వేగంగా దూసుకొచ్చిన ఆ ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో బైక్ పై ఉన్న ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడడంతో స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన డాక్టర్ రుబీనా ఆయువకులకు గాయాలు తీవ్రంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆస్పత్రికి ఫ్రిఫర్ చేయడం జరుగుతుందని అన్నారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్(టి) మండలం లింబుగూడ గ్రామానికి చెందిన నాగేష్, శ్రీకాంత్, జగన్నాథ్ అనే ముగ్గురు యువకులు ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. వేడుక ముగిసిన అనంతరం ఒకే ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న ఈ క్రమంలో సిర్పూర్(టి) మండల కేంద్రంలోని కోర్టు, జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలోకి రాగానే.. ఎదురుగా అదే గ్రామానికి చెందిన ఓ బ్లేడ్ ట్రాక్టర్ (మట్టిని చదును చేసే బ్లేడ్ అమర్చిన ట్రాక్టర్) అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకొచ్చి వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టిందని తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను కాపాడాల్సింది పోయి, డ్రైవర్ ట్రాక్టర్‌ను ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడని స్థానికుల తెలిపారు. ప్రమాద దుర్ఘటనలో బైక్ పై ఉన్న నాగేష్,శ్రీకాంత్, జగన్నాథ్‌లు తీవ్రమైన గాయాల రోడ్డుపై రక్తసిక్తంగా పడి ఉన్న ఆ ముగ్గురు శాత గాత్రులను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి హుటా హుటిన సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు.. యువకుల పరిస్థితి, గాయాల తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆ ముగ్గురు మంచిర్యాలలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.సమాచారం అందలేదన్న పోలీసులు..ఈ రోడ్డు ప్రమాదంపై పోలీసులను వివరణ కోరగా.. ప్రమాదానికి సంబంధించి బాధితుల కుటుంబ సభ్యుల నుంచి గానీ, ఆసుపత్రి వర్గాల నుంచి గానీ తమకు ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైె న చర్యలు తీసుకుంటా మని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వీటి పారుదల శాఖ, వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశం

పాల్గొన్న గ్రామ పెద్దలు రైతులు ఆయా శాఖల అధికారులు



**మే 9 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియో జకవర్గంలోని చింతల మానేపల్లి మండలం ఆడేపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల శాఖ మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో నీటి వనరులను ప్రోత్స హించి, చెరువులను కాపాడుకోవడం, పూడిక తీయడం వంటి విషయాల మీద వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సమీక్షంగా చర్చించి నిర్ణయాలు జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులను మర్యాద పూర్వకంగా కలిసిన మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి





**ఆదిలాబాద్ బ్యూరో, మే 8 (ప్రజా జ్యోతి)**ఆదిలా బాద్ వ్యవసాయ మా ర్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీక రించిన బోరంచు శ్రీకాం త్ రెడ్డి శనివారం పలువు రు కాంగ్రెస్ పార్టీ నాయ కులు, ప్రజా ప్రతినిధుల ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి, మాజీ మున్సి పల్ చైర్పర్సన్ దిగంబర్ పాటి ల్ నూ కలిసి శాలువాలతో సన్మానించారు. అందరిసాహకా రంతో రైతులందరి సలహాలు సూచనల మేరకు మార్కెట్ క మిటీ అభివృద్ధి, రైతులకు మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేస్తానని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు.

# ఈ నెల 11 నుండి విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**



**మంచిర్యాల, 9, మే (ప్రజా జ్యోతి):**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11 నుంచి నిర్వహించనున్న విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో విద్యా వారోత్సవాలు, ధాన్యం కొనుగోలు, రైతు నమోదు, జనగణన అంశాలపై శనివారం సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ, వారం, రైతు వారోత్సవాల అనంతరం విద్యా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు విద్యా వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలలో పనుల శంకుస్థాపనలు, ఎస్సెస్సీ పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థుల ఉత్తీర్ణత కోసం ప్రత్యేక విద్యా శిబిరాలు, వర్క్‌షాప్‌లు, బడిబాట కార్యక్రమం, పోషకుల సమావేశాలు, విద్యా వేడుకలు తదితర కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, జనగణనకు సంబంధించి స్వీయ గణన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మరింత వేగం పెంచి, వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన గోనె సంచులు, లారీలు, హమాలీలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు జరుగుతోందని తెలిపారు. ఇప్పటివరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. జిల్లాలో 12 రైస్ మిల్లులలో ప్రక్రియ ప్రారంభించగా, ధాన్యం నిల్వ కోసం 6 గోదాములను గుర్తించినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు లారీలు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షిస్తున్నామని, ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే విద్యా వారోత్సవాల నిర్వహణకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతు నమోదు ప్రక్రియ కొనసాగుతోందని, జనగణనలో భాగంగా ఈ నెల 10 వరకు స్వీయ గణనపై ప్రజలకు అవగాహన కల్పించి వివరాలు నమోదు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.. ఈ నెల 11 నుంచి చేపట్టనున్న ఇండ్ల గణన నిర్వహణపై ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాల నిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.

రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు

రైతులు ప్రభుత్వం సూచించిన నిర్దిష్ట కల్లాల్లోనే ధాన్యం ఆరబోసుకోవాలి.

డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్ నగర్ :** జిల్లాలో కొంతమంది రైతులు, వ్యాపారులు రహదారులపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం సరిగా కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో రహదారులపై ధాన్యం ఆరబోసి రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిర్దిష్ట కల్లాల్లో లేదా వ్యవసాయ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే ఆరబోసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ కోరారు.

## కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు

**రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల:**

**బండి సంజయ్ కుమార్**

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారంవల్లే ఆయన తండ్రి కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమయ్యారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కేటీఆర్‌ను చూసి బీఆర్ ఎస్ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రధాని రాక సందర్భంగా బండి నేతృత్వంలో ఆర్టీసీ ఎక్స్‌రోడ్ నుంచి అమీర్‌పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేటీఆర్ మాదిరిగా దోచుకోవడం నాకు తెలియదు. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం నాకు తెలియదు..డ్రగ్స్ తీసుకోవడం నాకు తెలియదు..కాళేశ్వరం, ఈ-ఫార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి మాకు తెలియదు..ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు, మంది కొంపలు ముంచడం అసలే తెలియదు, ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకునేలా చేయడం మాకు తెలియదు, మాకు ఏం తెలుసో ప్రజలు నిర్ణయిస్తారు. మీకు ఏం తెలుసో ప్రజలు గ్రహించి మిమ్మల్ని ఓడించారు అని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అహంకారం చూపించి, ఇప్పుడు అధికారం పోయాక కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కాళ్లు మొక్కుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఏం చేసినా రాష్ట్రంలో ఇక అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి తాము నిధులు తెస్తుంటే కాంగ్రెస్ నేతలు తెలంగాణ సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోటి దురుసుతనమే తమ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి కారణమని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ అన్నారు.

## ట్రస్ట్ ఇంచార్జికి ఘనంగా సన్మానం



**బాసర మే 9 (ప్రజా జ్యోతి)**బాసర లోని ఆర్యవైశ్య నిత్యఅన్నదాన సత్రం ఇన్చార్జి గాదేవర్ సంతోష్ సునీత దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వాసవి రెస్టారెంట్ సిబ్బంది శాలువాతో సత్కరించి ఘనంగా సత్కరించారు మంచితనానికి మారుపేరైన సంతోష్ గదేవర్ ఇలాంటి పెళ్లి రోజులు మరెన్నో జరుపుకోవాలని కొనియాడారు ఈ కార్యక్రమంలో బిదిరెల్లి మాజీ సర్పంచ్ దిగంబర్ రాజేందర్ అశోక్ గణేష్ ప్రసాద్ గణేష్ మరియు సచిన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## కొనుగోలు కేంద్రాలలో నెలల తరబడి రైతుల పడిగాపులు.

**వనపర్తి :** జిల్లాలో సివిల్ సప్ లై అధికారులు పూర్తిగా విఫలం. క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించాలి.బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తున్నా రైతుల గోస అ ధికారులకు పట్టదా అని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం రోజున బిసి నాయకుల సమావేశంలో మండిపడ్డారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎటు చూసినా రోడ్లపైన మొక్కలు, వడ్లు అరబోసి ఉండడంతో వ్యవసాయ మార్కెట్ కి వెళ్లి కొనుగోలు కేంద్రాలలో అక్కడ పరిశీలించగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న దన్నోజు అరవింద్ చారి ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ వడ్లు, మొక్కజొన్నలు సకాలంలో కొనుగోలు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. నెలల తరబడి కొనుగోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం మౌలిక వసతులు కూడా లేని పరిస్థితుల్లో మార్కెట్ యార్డుల్లో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు తరబడి ధాన్యం దగ్గర పడిగాపులు కాసే విధంగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. చలికి, ఎండకు, వానకు సంబంధం లేకుండా ప్రతి నెల క్రమం తప్పకుండా ప్రభుత్వం అధికారులకు వేతనాలు చెల్లిస్తుంటే, రైతులు మాత్రం ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా నెలల తరబడి నిరీక్షించాల అని ప్రశ్నించారు. కేవలం పైపై సమీక్షలు చేస్తే సరిపోదని, అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిలదీశారు. జిల్లాలో సివిల్ సప్లై వ్యవస్థ సక్రమంగా పని చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని, అలా జరగనప్పుడు దళారులు రైతులను నిలువున ముంచి తక్కువ ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, తక్షణమే ధాన్యం కాంటాలు చేసి ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేయాలని లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి హెచ్చరించారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా బిసి పొలిటికల్ జేఏసీ నాయకులు యశ్వంత్ గౌడ్, శివ, శేఖర్, రాజు, మహేందర్ నాయుడు, అంజి యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.